క్లుప్తంగా

విద్యార్థులకు టోపీల అందజేత


టోపీలు అందజేస్తున్న దాత

డోన్: వేసవిని దృష్టిలో ఉంచుకుని కొత్తపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం టోపీలు పంపిణీ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సురేష్(బెంగళూరు) ఆర్థిక సహాయంతో విద్యార్థులకు టోపీలు అందజేసినట్లు ప్రార్థన సమయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తెలిపారు. హెచ్‌ఎం రాంనర్సప్ప, ఉపాధ్యాయులు మాణిక్యంశెట్టి, చందు, లోకనాథ్‌రెడ్డి దాతను అభినందించారు.

22న కోవెలకుంట్లలో వేలం పాట

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో ఈ నెల 22వ తేదీ బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 11వ తేదీ వేలం పాట నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా పడిందన్నారు. వేలం పాటను తిరిగి శనివారం ఏర్పాటు చేశామన్నారు. సంతమార్కెట్ నిర్వహణకు ప్రాథమిక ధరావత్తు రూ. 3.50 లక్షలు, దినమార్కెట్‌కు రూ. 3 లక్షలు, బస్టాండ్ పనులకు రూ. 3 లక్షలు, కమేళాకు రూ. 8 వేలు ధరావత్తు నిర్ణయించామన్నారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో పొందిన సాల్వెన్సీ సర్టిఫికెట్ లేదా రూ. లక్ష అదనపు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు.

నేడు రక్తదాన శిబిరం

కోవెలకుంట్ల: స్థానిక ఎస్‌ఎల్‌వీ సినిమా థియేటర్ ఆవరణలో విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు గోపిరెడ్డి ప్రతాప్ రెడ్డి తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి సకాలంలో అన్ని గ్రూపులకు సంబంధించిన రక్తం అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల బ్లడ్‌బ్యాంకు సిబ్బంది రక్తాన్ని సేకరిస్తారని పేర్కొన్నారు. కోవెలకుంట్లతోపాటు పరిసర ప్రాంతాల యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

దివ్యాంగులకు రుణాలు మంజూరు చేయాలి

కోవెలకుంట్ల: ప్రభుత్వం దివ్యాంగులకు రాయితీ రుణాలు ఇవ్వాలని ఆ సంఘం జేపీసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు కోరారు. మంగళవారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడారు. వార్షిక బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించిన రూ.4,322 కోట్లలో అర్హులైన దివ్యాంగులకు రూ. 10లక్షల వరకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. త్రీవీలర్ స్కూటీ విషయంలో 40 ఏళ్లు ఉండాలన్న నిబంధన తొలగించి దివ్యాంగులందరికీ పంపిణీ చేయాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే మే నెలలో జేపీసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

జాబ్‌మేళాలో 12 మంది ఎంపిక

డోన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మేళాలో రాజా బ్యాగ్స్, అమితి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్ ఎయిర్ కండీషనర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 26 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 12 మందిని ఎంపిక చేసినట్లు ట్రైనింగ్ ఆఫీసర్ ధర్మాకర్ తెలిపారు.

సుంకులమ్మ సేవలో కాటసాని


అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: మండలంలోని కటికవానికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులమ్మ ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి మంగళవారం దర్శించుని పూజలు చేశారు. వారి వెంట పార్టీ నాయకులు మల్లేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పుస్తకాల వితరణ

బనగానపల్లె రూరల్: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సురేష్‌కుమార్‌రెడ్డి సుమారు రూ.15వేల విలువైన నీట్, మెడిసిన్, పీజీకి సంబంధించిన పుస్తకాలను బనగానపల్లె గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు. ఆయనకు గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపవాసం.. ముక్తిమార్గం

- దానధర్మాలకు ప్రతీక రంజాన్ మాసం
- పేదల ఆకలిదప్పులను తెలిపే ఉపవాసాలు
- ఈ నెల 27న షబ్ ఏ ఖదర్ (పెద్దరాత్రి)


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ముస్లింలు

ప్యాపిలి: హిజ్రీ క్యాలెండర్‌లోని 12 నెలల్లో రంజాన్ మాసాన్ని ముస్లింలు అత్యంత పవిత్ర మాసంగా భావిస్తారు. పేదల ఆకలిదప్పులు స్వయంగా తెలియాలన్న ఉద్దేశంతో ఈ మాసంలో ఉపవాసాలు విధిగా ఉండాలని అల్లా ఆదేశించారు. జీవితాన్ని సన్మార్గంలో ఉంచేందుకు శిక్షణ పొందే మాసంగా కూడా ఈ నెలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ముస్లింలు రంజాన్ మాసంలో నమాజ్, రోజా, జకాత్, ఫిత్రా వంటి సత్కార్యాలతో పాటు నిరంతరం ఖురాన్ పవిత్ర గ్రంథాన్ని పఠిస్తారు. రంజాన్ మాసంలో చేసే ప్రతి మంచి పని దైవారాధన కిందకే వస్తుంది.

30 రోజుల కఠోర ఉపవాసాలు

రంజాన్ నెలవంక కనిపించిన మరుసటి రోజు నుంచి నెల పాటు ముస్లింలు కఠోర ఉపవాసాలు పాటిస్తారు. ఈ నెల 2వ తేదీ ప్రారంభమైన ఉపవాస దీక్షలు 30 రోజులు కొనసాగుతాయి. సూర్యోదయానికి ముందు భుజించే ఆహారాన్ని సహరీ అంటారు. సహరీతో ఉపవాస దీక్ష (రోజా) ప్రారంభం అవుతుంది. పగలంతా రోజా ఉండే ముస్లింలు నీరు కూడా తాగకుండా ఉపవాసంలో గడుపుతారు. సూర్యాస్తమయం తర్వాత కొద్దిపాటి ఆహారాన్ని స్వీకరించి ఉపవాస దీక్షను విరమిస్తారు. దీన్ని ఇఫ్తార్ అంటారు. కొన్నేళ్లుగా రంజాన్ మాసం వేసవిలో వస్తోంది. దీంతో మండుటెండల్లో కూడా ముస్లింలు కఠోర ఉపవాసాలు చేస్తూ అల్లా ఆరాధనలో గడుపుతున్నారు. ఇఫ్తార్ సమయం దగ్గర పడేకొద్దీ ఉపవాసం చేసేవారి గొంతు దాహంతో తడారిపోతుంది. అయినా ఇఫ్తార్ సమయం కోసం ఎంతో ఓర్పు, సహనంతో ఎదురు చూస్తుంటారు. అందుకే రంజాన్ నెలను ఓర్పు, సహనానికి మారుపేరుగా కూడా పిలుస్తారు.

దానధర్మాలు చేస్తే 70 రెట్ల పుణ్యం

రంజాన్ మాసంలో చేసే దానధర్మాలకు ఇతర మాసాల్లో చేసే దానధర్మాల కంటే 70 రెట్లు అధిక పుణ్యాన్ని ఇస్తానని ముస్లింల విశ్వాసం. పేద, ధనిక తేడా లేకుండా అందరూ కలిసి రంజాన్ పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో ఆర్థిక స్థోమత ఉన్నవారు పండుగ కంటే ముందు జకాత్, ఫిత్రా తప్పనిసరిగా చేయాలి. అందుకే ఈ మాసంలో ముస్లింలు దానధర్మాలు చేస్తూ ఖర్చుకు వెనుకాడరు. అయితే అప్పులు చేసి దానధర్మాలు చేయడాన్ని ఇస్లాం సమ్మతించలేదు.

పేద, ధనిక తేడాను చెరిపివేసే రంజాన్

పూటగడవని నిరుపేదలు ఆకలిదప్పులతో ఎంత అల్లాడిపోతున్నారో ఉపవాసాలు ఉన్నవారికి స్వయంగా అనుభవం తెలుస్తుంది. ఫలితంగా పేదల ఆకలి తీర్చాలన్న దానగుణం, మానవత్వం వారిలో వికసిస్తుంది. ఇఫ్తార్ సమయంలో ఉపవాసి కోరిన ఏ దువా అయినా అల్లా అంగీకరిస్తాడని ముస్లింల నమ్మకం. మసీదుల్లో చేసే నమాజుల్లో పేద, ధనిక తేడా లేకుండా అందరూ పక్కపక్కనే నిలబడి ప్రార్థనలు చేస్తారు. ఇఫ్తార్ విందులో సోదరభావంతో అందరూ పక్కపక్కనే కూర్చుని ఉపవాస దీక్షలను విరమిస్తారు.

27న షబ్ ఏ ఖదర్ (పెద్దరాత్రి)

రంజాన్ మాసంలో 26వ ఉపవాసం రోజు వచ్చే 27వ రాత్రిని షబ్ ఏ ఖదర్ అంటారు. ఈ నెల 27వ తేదీ వచ్చే ఈ రాత్రి అత్యంత ప్రాముఖ్యమైన రాత్రి. ఇదే రాత్రి ఖురాన్ దివి నుంచి భువిపైకి అవతరించినట్లు ముస్లింలు భావిస్తారు. ఈ రాత్రంతా ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల్లో గడిపి జాగరణ చేస్తారు.

అల్లాహ్‌పై భయంతో మెలగాలి



రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాసం ఉంటూ నిషేధిత పనులు చేయరాదు. చేసే ప్రతి పనినీ అల్లాహ్ గమనిస్తున్నాడన్న భయం కలిగి ఉండాలి. రోజా అంటే కేవలం ఆకలి, దప్పులతో ఉండడం కాదు. మాటలు మృదువుగా మాట్లాడాలి. తనతో ఎవరైనా గొడవకు దిగినా దూరంగా ఉండాలి. చెడు మాటలు మాట్లాడరాదు. చెడు పనులు చేయరాదు. చెడు ఆలోచనలు మనసులోకి రానివ్వరాదు. ముఖ్యంగా మహిళలపై గౌరవాన్ని కలిగి ఉండాలి.

–హాఫీజ్ మహబూబ్ ఖాన్, ప్రభుత్వ ఖాజీ, ప్యాపిలి

పేదలపై దయ కలిగి ఉండాలి



రంజాన్ మాసంలో ముస్లింలు తమ సంపాదనలో కొంత భాగం పేదలకు దానం చేస్తారు. పేదలపై దయ, జాలి కలిగి ఉండాలన్నదే రంజాన్ మనకు ఇచ్చే సందేశం. ఆర్థిక స్థోమత ఉన్నవారు పేదలకు దానధర్మాలు చేస్తే వారు కూడా సంతోషంగా ఉంటారనే ఫిత్రా, జకాత్‌ను నిర్ణయించారు. ఈద్ ప్రార్థన కంటే ముందు ప్రతి ఒక్కరూ ఫిత్రా, జకాత్‌ను తప్పనిసరిగా చెల్లించాలి. అర్హులైన వారికే దానధర్మాలు చేయడం ద్వారా రంజాన్ ఉద్దేశం నెరవేరుతుంది.

–మహబూబ్ సాహెబ్, ప్యాపిలి

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

బనగానపల్లె రూరల్: మండలంలో ఆధార్ అప్‌డేట్ కోసం బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ బీవీ రమణ తెలిపారు. ఈ నెల 19, 20, 21, 22 తేదీల్లో ఇల్లూరుకొత్తపేట గ్రామ సచివాలయం, బనగానపల్లె ఎంపీపీ కస్బా పాఠశాల, పసుపల ఎంపీపీ, పలుకూరు ఎంపీపీ మెయిన్ పాఠశాలలు, అలాగే ఈ నెల 25,26, 27,28 తేదీల్లో బనగానపల్లె సచివాలయం-4, సచివాలయం-2, పాతపాడు ఎంపీపీ పాఠశాల, పలుకూరు ఎంపీపీ మెయిన్ పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు జరుగుతాయని వెల్లడించారు. ఆయా ఆధార్ సెంటర్ల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు గ్రామంలో బుధవారం పెద్దమ్మ జాతర సందర్భంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. బనగానపల్లె నుంచి టంగుటూరు మీదుగా నంద్యాలకు వెళ్లే భారీ వాహనాలు బనగానపల్లె నుంచి పాణ్యం మీదుగా వెళ్లాలని చెప్పారు.

రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు

అవుకు: రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అవుకు వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ సూచించారు. మంగళవారం నిచ్చెనమెట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. బ్యాటరీ స్ప్రేయర్లు, ఫుట్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ దుక్కు, దమ్ము సెట్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లను ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

నారాయణ దివ్య ప్రబంధ పఠనం


నారాయణ దివ్య ప్రబంధనాన్ని పఠిస్తున్న భక్తులు


పూజలందుకున్న రామానుజాచార్య

డోన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 200 మంది మహిళా భక్తులు నారాయణ దివ్య ప్రబంధనాన్ని పఠించారు. ఈ నెల 27వ తేదీ జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, మద్ది శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాముశర్మ పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


గూటుపల్లెలో ఎల్లమ్మకు పూజలు చేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, సర్పంచ్


ఎల్లమ్మకు బోనాలు, లింగమయ్యకు కావిడీలతో వస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో ఎల్లమ్మ, లింగమయ్య విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజులు పూర్తి కావడంతో మంగళవారం భక్తులు బోనాలు, కావిడీలతో వచ్చి మొక్కులు చెల్లించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, మండల, పట్టణ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఎల్లమ్మ, లింగమయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌జీఎస్ పీడీ వెంకటసుబ్బయ్య

బనగానపల్లె రూరల్: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎన్‌ఆర్‌జీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) వెంకటసుబ్బయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయంలో ఉపాధి పనులపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. మండలానికి కేటాయించిన గోకులం షెడ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రతి రోజు 5 వేల మంది కూలీలు వచ్చేలా టీఏ, ఎఫ్‌ఏలు చర్యలు తీసుకోవాలని, వేసవి కాలంలో పనుల వద్ద కూలీలకు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ బీవీ రమణ, ఏపీఓ రేష్మా, ఈసీ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల ఇష్టారాజ్యం


ఆర్బీకే వద్ద మద్యం సేవించి పడేసిన ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు (ఇన్‌సెట్)ధ్వంసమైన కిటికీ అద్దాలు

కొలిమిగుండ్ల: మందు బాబుల ఆగడాలకు హద్దు లేకుండాపోతోంది. గ్రామాల్లో బెల్ట్‌షాపులు, నాటుసారా ఇష్టానుసారంగా విక్రయాలు జరుగుతున్నాయి. మందు బాబులు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్దే యథేచ్ఛగా మద్యం తాగుతున్నారు. తుమ్మలపెంటలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ఒకే చోట ఏర్పాటు చేశారు. చీకటి పడగానే మందు బాబులు ఇక్కడ తిష్టవేసి మద్యం సేవిస్తుంటారు. మద్యం తాగాక ఖాళీ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లను ఎక్కడ పడితే అక్కడే పడేసి వెళుతున్నారు. కొద్ది రోజులుగా ఈతంతు నడుస్తోంది. ఆర్బీకే, హెల్త్ క్లీనిక్ సిబ్బంది ఉదయం డ్యూటీలకు వచ్చే సరికి మద్యం బాటిళ్లతో పరిసరాలు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. రోజు శుభ్రం చేస్తున్నా తెల్లవారే సరికి మందు బాబులు బాటిళ్లు తాగి పడేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. మద్యం మత్తులో కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. మందు బాబుల ఆగడాలను అరికట్టాల్సిన అవసరం ఉందని సిబ్బందితో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

సామాజిక తనిఖీలో బయటపడ్డ అక్రమాలు

- పలు గ్రామాల్లో సిబ్బంది చేతివాటం
- రూ.1.35 లక్షల రికవరీకి ఆదేశం


సామాజిక తనిఖీలో భాగంగా గ్రామాల వారీగా విచారణ చేస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అక్రమాలు సామాజిక తనిఖీలో బయట పడ్డాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 23 గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24లో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, హౌసింగ్ కింద రూ.6.30 కోట్లతో చేపట్టిన పనులపై విచారణ చేశారు. ఉపాధి పథక ప్రొసీడింగ్ ఆఫీసర్ బాలాజీ నాయక్, డీవీసీ శోభారాణి, ఏపీడీ సాంబశివరావు ఆధ్వర్యంలో గ్రామాల వారీగా విచారణ చేసిన పలు విషయాలను డీఆర్పీలు చదివి వినిపించారు. బందార్లపల్లెలో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయకుండానే పేమెంట్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. మస్టర్లలో సంతకాలు లేకుండానే పనులు చేసినట్లు గుర్తించారు. రోడ్డు పక్కల నాటిన మొక్కల్లో 420 మొక్కలు కనిపించకుండా పోయాయని తనిఖీలో గుర్తించారు. పలు గ్రామాల్లో పనులకు పోకుండానే వెళ్లినట్లు హాజరు వేసుకున్నారు. చేసిన పనులకు రికార్డుల ప్రకారం క్షేత్ర స్థాయిలో సరిగ్గా కొలతలు లేవని సభ దృష్టికి తీసుకొచ్చారు. చాలా చోట్ల రోడ్ల వెంట నాటిన మొక్కలు లేకుండాపోయాయి. పనులు చేపట్టినా పాడై పోయాయని చెప్పడం విశేషం. మొత్తంగా రూ.1.35 లక్షలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు నిర్ధారించడంతో సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. పెనాల్టీ కింద రూ.14వేలు, రెక్టిఫికేషన్ కింద రూ.51 వేలు వసూలు చేయాలన్నారు. సామాజిక తనిఖీ బహిరంగ సభలో గ్రామాల నుంచి కూలీలు, రైతులు, ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదు. కేవలం ఉపాధి హామీ పథకం సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఏపీఓ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

డోన్ రూరల్: పట్టణ సమీపంలోని అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో మంగళవారం ఉమ్మడి జిల్లా అండర్-12 బాల, బాలికలకు రగ్బీ పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజినేయులు పోటీలను ప్రారంభించారు. చిన్న వయసు నుంచే క్రీడల్లో పట్టుసాధించాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచే రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

డోన్ రైల్వేస్టేషన్ పరిశీలన

డోన్ రూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌ను మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్ డివిజన్ ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ వెంకట్రమణారెడ్డి పరిశీలించారు. ఆయనకు డోన్ రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. అనంతరం స్టేషన్‌లోని కౌంటర్, రికార్డులు, ట్రాక్‌ను పరిశీలించారు. సిబ్బందిని అడిగి సమస్యలను తెలుసుకున్నారు. హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు రైల్వేట్రాక్‌ను పరిశీలిస్తూ డోన్ రైల్వే స్టేషన్‌కు వచ్చినట్లు ఆయన తెలిపారు.

పద్య రచన పోటీల్లో విజేత డోన్ హెచ్‌ఎం


సురేష్‌బాబు

డోన్ టౌన్: ఉగాదిని పురస్కరించుకుని విజయనగరానికి చెందిన విజయ భావన సాహితీ మిత్ర సమాఖ్య 'యువత భవిష్యత్తు' అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి పద్య రచన పోటీల్లో డోన్ నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తొగట సురేష్‌బాబు విజేతగా నిలిచినట్లు ఆ సంస్థ ప్రతినిధి గోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది రోజున నగదు పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయనకు తోటి ఉపాధ్యాయులు వెంకటేశ్వరగౌడ్, మౌలాలి, రాంప్రసాద్, శివశంకరయ్య, రామకృష్ణారెడ్డి, శారదాదేవి, లక్ష్మీనాయక్ తదితరులు అభినందనలు తెలిపారు.

గొడవలకు వెళితే జైలు జీవితం తప్పదు


మాట్లాడుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్

కోవెలకుంట్ల: అల్లర్లు, గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని ఆళ్లగడ్డ డీఎస్పీ కె. ప్రమోద్ సూచించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని భీమునిపాడు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అవసరమైతే పోలీసుల సాయం తీసుకోవాలని తెలిపారు. కక్షలు, కార్పణ్యాలకు వెళితే కేసులు నమోదై వారితో పాటు వారి పిల్లల జీవితం అంధకారమవుతుందన్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తులకు ఆధార్, బ్యాంకు ఖాతా, ఓటీపీ, ఇతర వివరాలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదని తెలిపారు. వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉందని, ఇళ్లకు తాళం వేసి పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు వెళ్లే వారు పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. డీఎస్పీ వెంట కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

ఓటరు నమోదుకు సహకరించండి


రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆర్డీఓ నరసింహులు

డోన్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు సన్నద్ధం కావాలని ఆర్డీఓ నరసింహులు అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాను మరోసారి పరిశీలించి ఏవైనా తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు సహకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, సోమేష్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రమణ, కిరణ్, సుబ్బుయాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు


సహస్ర దీపాలంకరణ సేవలో శ్రీదేవి, భూదేవి మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో పాల్గుణ మాసాన్ని పురస్కరించుకుని స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలాచక్రవర్తి శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవ, విశ్వక్సేనారాధన, వాసు దేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశ స్నపనం, నరసింహ హోమం, పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం చేశారు. తర్వాత అలంకార ప్రియుడైన స్వామి వారికి సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య రమణీయంగా ఊరేగింపు చేపట్టారు.

ఒకే ఈతలో నాలుగు మేక పిల్లలు



బేతంచెర్ల:అంబాపురం గ్రామంలో మేకకు ఒకే ఈతలో నాలుగు పిల్లలు పుట్టాయి. ఎక్కడైనా మేక ఒకటి లేదా రెండు పిల్లలకు జన్మనిస్తుందని, నాలుగు పిల్లలు పుట్టడం అరుదైన సంఘటన అని గ్రామస్తులు తెలిపారు.

రీసర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

డోన్ టౌన్/డోన్ రూరల్: గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వేలో పొరపాట్లకు చోటులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కె.నాగమణి సర్వేయర్లకు సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలంయలో మంగళవారం రీసర్వేపై సిబ్బందితో సమీక్షించారు. రీసర్వే చేసే సమయంలో అనుమానాలు తలెత్తితే అధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. తప్పులకు ఆస్కారం లేకుండా సర్వే చేయాలని ఆదేశించారు. డీటీ సునీల్‌కుమార్, మండల సర్వేయర్ జగదీష్, వీఆర్వోలు పాల్గొన్నారు.